

ఆచారం.. మారేదెలా..!
మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్న నేటి తరుణం లోనూ ఉమ్మడి జిల్లాలో ఓ ఆచారం మహిళ లకు ప్రాణసంకటంగా మారుతోంది. కొలాం ఆదివాసీల్లో చైతన్యం రావాల్సి ఉంది. 8లో▸



అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు
జల్సాలకు అలవాటు పడి బైక్‌లు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశా రు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ జన్నారం పోలీ సుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం
ఉదయం వేళలో ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ ఆకాశం మేఘావృ తమై ఉంటుంది. పడమర దిశగా ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మందులు, వ్యాక్సిన్ల కొరత లేకుండా చూస్తాం

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్



మాట్లాడుతున్న అధికారి హరీష్‌రాజ్

సాక్షి ఎఫెక్ట్..

పాతమంచిర్యాల: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, వ్యాక్సిన్ల కొరత లేకుండా చూ స్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన విధుల్లో చేరిన సందర్భంగా జిల్లా వైద్య, ఆరో గ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 'సాక్షి'లో బుధవారం 'వైద్య..దైన్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో మందులు, ఇతర వసతులపై వైద్య బృందాలతో తనిఖీ చేపట్టామని తెలిపారు. మందులు, వ్యాక్సిన్లు తెప్పించడానికి రెండు వాహనాలు ఏర్పాటు చేసి సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌కు పంపించామని చెప్పారు. ప్రతీ పీహెచ్‌సీలో లేబర్‌రూంలు, ఆపరేషన్ థియేటర్లు ఆధునీకరించి వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. పల్లె దవాఖానాల్లో అన్ని రకాల మందులు, సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సీజేరియన్ ఆపరేషన్‌ను కట్టడి చేస్తామని, ఆయా ఆస్పత్రుల్లో సీజేరి యన్‌లపై ఆడిట్, పరిశీలన చేస్తామని తెలిపా రు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూస్తామని, సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు ప్రసాద్, సీతారామరాజు, అనిత, ఫయాజ్‌ఖాన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి

- జిల్లా కలెక్టర్‌కుమార్ దీపక్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు అందించాలని, రోగనిరోధక శక్తి పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని జాఫర్‌నగర్ నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. సరైన పద్ధతిలో కూర్చుని పిల్లలకు పాలు ఇవ్వాలని, తల్లి పాలతో పిల్లల ఎముకలు పటిష్టంగా అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అనిత, సీడీపీవో విజయలక్ష్మి, పోషణ్ అభియన్ జిల్లా సమన్వయకర్త రజిత, డీపీఏ శ్యామల, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హాజీపూర్ మండలంలో ఆకస్మిక పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. గుడిపేట, కర్ణమామిడి, రాపల్లి, నర్సింగాపూర్, రాజేశ్వర్‌రావుపల్లెలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాల్లో భాగంగా పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. నర్సింగాపూర్, రాపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. పడ్తనపల్లిలోని ఆరోగ్య సబ్‌సెంటర్‌తోపాటు ఆదర్శ పాఠశాలను సందర్శించి రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయుల బోధన తీరును ప్రత్యక్షంగా తరగతి గదిలో కూర్చుని పరిశీలించారు.

పీహెచ్‌సీ సందర్శన

హాజీపూర్‌లోని పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి, డీఈఓ యా దయ్య, ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం–పచ్చదనం' పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనంలో జరుగుతున్న పనులను ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తూ నివేదిక అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్న సమయాల్లో సమీపంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేనట్లయితే విద్యార్థులకు తరగతులు తీసుకోవాలని తెలిపారు.

ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, బొజ్జు, అనిల్‌జాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కిగౌడ్ తదితరులు



గుండెల్లో పెట్టుకుంటాం



అభివాదం చేస్తున్న భట్టి

- ఈ ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం..
- 'ఆదిలాబాద్'ను ముందు వరుసలో నిలుపుతాం..
- దత్తత పిప్రి గ్రామం నుంచి ఉమ్మడి జిల్లాపై డిప్యూటీ సీఎం వరాలు
- ఒక్కరోజుతో అయిపోయేది కాదు.. మళ్లీ వస్తా
- పాదయాత్ర ప్రారంభించిన నేలపై 'భట్టి' భావోద్వేగం



శిలాఫలకం ఆవిష్కరించి పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం విక్రమార్క, పక్కన ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, బొజ్జు, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..
ఐటీడీఏ ద్వారా బజార్‌హత్నూర్ మండలంలోని తొమ్మిది గిరిజన గ్రామాలకు రూ.1.50కోట్ల నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.60 లక్షల నిధులతో మూడు జీపీలకు నూతన భవనాల నిర్మాణం, పిప్రి నుంచి మోద గ్రామం వరకు రూ.2.67 కోట్ల నిధులతో బీటీ రోడ్డు, నేరడిగొండ మండలం వాంకిడిలో టీఎస్ఎన్పీడీసీఎల్ ద్వారా రూ.2.20 కోట్ల నిధులతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

సాక్షి, ఆదిలాబాద్/బజార్‌హత్నూర్: 'పాదయాత్ర ప్రారంభించిన రోజు మీరంతా గుండెల నిండా ఆశీర్వదించి పంపించారు.. సీఎల్పీ నేతగా నేను ఓ వైపు.. నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరోవైపు ఆదిలాబాద్ నుంచే యాత్రలు ప్రారంభించాం.. మీ ఆశీర్వాద బలంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇదే స్ఫూర్తితో కార్యక్రమాలన్నింటిని విజయవంతంగా చేయగలుగుతున్నాం.. ఇప్పటికీ ఆదిలాబాద్ జిల్లాను వెనుకబడిన జిల్లా అని చెప్పుకోవడం బాధగా ఉంది. నేను ఈ విషయాన్ని ఒప్పుకోను.. ఈ జిల్లాను అన్ని జిల్లాల కంటే ముందుంచుతా.. ముఖ్యమంత్రితో పాటు నేను మా మంత్రివర్గ సహచరులందరూ ఈ జిల్లాను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం.. అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాలోని పిప్రిలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో అన్నారు. గతేదాది మార్చి 16న ఇక్కడి నుంచే నా పాదయాత్ర ప్రారంభించా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏదాది మార్చి 16న ఇక్కడికి రావాలనుకున్నా.. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో కుదరలేదు.. ఇప్పుడు ఇక్కడికి రావడం ఆనందంగా ఉంది.. అని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాపై పలు వరాలు కురిపించారు. బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించినట్లు తెలిపారు.

ఆగిపోతుందని అంతా అనుకున్నారు..
మండుటెండల్లో ప్రారంభించిన నా పాదయాత్ర రెండు రోజులు.. లేదంటే రెండు గ్రామాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు.. అయితే ప్రజల సమస్యలను వింటూ 1,365 కిలో మీటర్ల పాదయాత్ర పూర్తి చేశాను.. పిప్రి ప్రజల ఆశీర్వాదంతోనే ఇదంతా జరిగింది. ఆ పాదయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నాం.. అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి ఒక బాధ్యతగా నడుచుకుంటున్నాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఏ ఒక్క హామీని మర్చిపోకుండా అమలు చేస్తున్నాం. రూపాయి కూడా దుబారా కాకుండా ప్రజలకే ఉపయోగపడేలా చూస్తున్నామని భట్టి పాదయాత్ర రోజులను గుర్తు చేసుకుంటూ చెప్పారు.

మళ్లీ వస్తా..
ఇది ఒక్కరోజుతో అయిపోయే కార్యక్రమం కాదు. 32 రోజులు ఉమ్మడి జిల్లాలో నడిచాను. అనేక చోట్ల అనేక మందితో మాట్లాడాను. నిద్రించిన గ్రామాలెన్నో ఉన్నాయి. ఎక్కడెక్కడో బస చేశాను. ఆ ప్రతి గ్రామాన్ని సందర్శిస్తా. అక్కడ ఇచ్చినటువంటి ప్రతి మాటను నిలుపుకుంటా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చేస్తానంటూ భట్టి ఉమ్మడి జిల్లా ప్రజలకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, వెడ్మబొజ్జు పటేల్, అనిల్ జాదవ్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజిరావు పాటిల్, డీఈవో ప్రణీత, కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావు, ఉప ముఖ్యమంత్రితో పాటు వచ్చిన ఐఏఎస్ అధికారులు కృష్ణభాస్కర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరాలు ఇలా..

- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పునఃప్రారంభం. నాలుగైదు నెలల్లోనే పనులు ప్రారంభిస్తాం.
- పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు.
- పిప్రిలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు.
- కుప్టి ప్రాజెక్టు పూర్తి చేస్తాం. ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కేటాయించాం.
- త్రివేణి సంగమం కడతాం. చెక్‌డ్యామ్ నిర్మిస్తాం. పులిమడుగును చేపడతాం.
- అడ వద్ద కుమురంభీం కాలువలు పూర్తి చేస్తాం. నీళ్లు పారిస్తాం.
- ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ కారణంగా మంచిర్యాల మునుగుతుంది. ఈ సమస్య పరిష్కారం కోసం రూ.260 కోట్లు మంజూరు. దీంతో రిటైనింగ్ వాల్ (ప్రొటక్షన్ వాల్) నిర్మిస్తాం.
- పెద్దవాగు కోసం రూ.12.32 కోట్లు మంజూరు. కుమురంభీం, నీల్వాయి, వట్టివాగు, గొల్లవాగు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కోసం రూ.400 కోట్లు కేటాయించాం.
- సదర్‌మాట్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. నీళ్లు అందిస్తాం.
- చనాఖా-కొరటా మూడు నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం. నీళ్లు పారిస్తాం.
- పెన్‌గంగ పైన పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం.
- బుగ్గారం, తేజాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు.
- ఐటీడీఏను పరిపుష్టి చేస్తాం.
- అటవీ నుంచి వెదురు, మట్టి తెచ్చుకునే విషయంలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తాం.
- పోడు భూములకు పట్టాలిస్తాం.. రుణాలు ఇస్తాం.. సమగ్ర భూచట్టాన్ని తీసుకువస్తున్నాం.

స్టాల్స్ సందర్శించి.. చెక్కులు అందజేసి

డిప్యూటీ సీఎం ఉదయం ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలుదేరి పిప్రికి మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న స్టాల్స్‌ను సందర్శించారు. మార్కెటింగ్, వస్తువుల ఉత్పత్తి వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. స్వయం ఉపాధితో రాణిస్తున్న వారి తో మాట్లాడారు. ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలను తిలకించారు. ఎస్సీ కార్పొరేషన్, ట్రైకార్, ఐటీడీఏల ద్వారా మంజూరైన బ్యాంక్ లింకేజీ చెక్కులను మహిళలకు అందజేశారు. జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి ఫలి తాల్లో 10 జీపీఏ పాయింట్లు సాధించిన 11మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఐసీడీఎస్ ద్వారా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్లారు.



మహిళలకు చెక్కు అందజేస్తూ..



వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తూ..

సమస్యలు తీర్చండి.. ఉమ్మడి జిల్లాను ఆదుకోండి

ఉప ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యేలు
ఇచ్చోడ: సభకు హాజరైన బోథ్, ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, బొజ్జు, ప్రేంసాగర్‌రావు నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. పరిష్కరించాలని డిప్యూటీ సీఎం విక్రమార్కను కోరారు.

కుప్టికి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి



బోథ్ ప్రాంత రైతుల అవసరాలు దృష్టిలో ఉంచుకొని కుప్టి ప్రాజెక్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి. ఐదు మండలాలకు సాగునీరు అందించేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. 19 చెరువులకు మంజూరైన రూ.140 కోట్లు వెంటనే విడుదల చేయాలి. అడేగామ(కే) వద్ద నిర్మించిన చెరువుకు కాలువ పనులు పూర్తిచేసి 1200 ఎకరాలకు సాగునీరు అందించేలా చొరవ చూపాలి. అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించి ఆయా మార్గాల్లో రహదారుల పనులు పూర్తి చేయాలి. – అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

డబుల్ రోడ్డు పనులకు అనుమతులివ్వాలి



ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వరకు, ఉట్నూర్ నుంచి మంచిర్యాల వరకు డబుల్ రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు ఇప్పించి ఉమ్మడి జిల్లాకు న్యాయం చేయాలి. మూడు జిల్లాలను కలిపే ఈ రోడ్లు టైగర్ జోన్ పరిధిలో ఉండటంతో కొన్నేళ్లుగా పనులు మంజూరు కావడం లేదు. ఖానాపూర్ నియోజకవర్గంలో అల్లంపల్లి, వాయిపేట్ వంటి మారుమూల గ్రామాలకు 108 సైతం వెళ్లలేని పరిస్థితి. ఏజెన్సీ పరిధిలోని అనేక గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక గిరిపుత్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాలకు వెంటనే రోడ్డు వ సతి కల్పించాలి. రైతు రుణమాఫీ విషయంలో మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంకులలో లోపాలను సరిదిద్ది అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చొరవ చూపాలి.
– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

వట్టివాగు ద్వారా సాగు నీరందించాలి



వట్టివాగు ప్రాజెక్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి నాలుగు టీఎంసీల నీటిని లింగాపూర్, సిర్పూర్, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల రైతులకు అందించాలి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో వైఎస్సార్ హయాంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టుకు కాలువల పనులు త్వరగా పూర్తిచేయాలి. మంచిర్యాలలో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి. కుమురంభీం ప్రాజెక్టు కెనాల్ పనులు సైతం త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలి.
– ప్రేంసాగర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల

మొక్కలు నాటే శిక్ష!

- హైకోర్టు వినూత్న తీర్పు
- అటవీ కేసులో ట్రాక్టర్ యజమానికి ఉత్తర్వులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రిజర్వు ఫారెస్టులో దున్నిన ట్రాక్టర్‌ను కేసు నుంచి విడిపించుకోవడానికి హైకోర్టును ఆశ్రయించిన యజమానికి ఊహించని విధంగా తీర్పు వచ్చింది. అడవికి నష్టం చేసిన చోటే కొత్తగా మొక్కలు నాటాలంటూ పిటిషనర్‌కు అటవీ రక్షణ బాధ్యతను గుర్తు చేసేలా ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు బుధవారం హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో అడవుల్లో పోడు, పట్టాలేని భూముల్లో ట్రాక్టర్‌తో దున్నాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించి ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేసు పూర్వపరాలు పరిశీలిస్తే..
గత జూలైలో నెన్నెల మండలం కుశ్నపల్లి రేంజ్ లింగాల సెక్షన్, లింగాల బీట్ పరిధిలోని అటవీ భూమిని ట్రాక్టర్‌తో దున్నుతున్నారనే సమాచారం మేరకు లింగాల సెక్షన్ ఆఫీసర్ శ్రీలత, ఎఫ్‌బీవో రాజ్‌కుమార్ అటవీ భూమి సాగు చేసేందుకు ప్రయత్నించిన బాధ్యులపై కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి ఏ1గా ఆలం తిరుపతి(డ్రైవర్), ఏ2గా బొడ్డు బక్కయ్య, ఏ3గా ట్రాక్టర్ యజమాని మాడె మల్లేశ్‌ను చేర్చారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయగా ఇంకా కేసు బెల్లంపల్లి కోర్టులో విచారణ సాగుతోంది. ట్రాక్టర్ యజమాని మాడె మల్లేశ్ తన ట్రాక్టర్‌ను కేసు నుంచి విడిపించేలా అటవీ అధికారులను ఆదేశించాలంటూ హైకోర్టులో రిట్(మాండమస్) పిటిషన్ వేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన కోర్టు పలు అటవీ ఆక్రమణల కేసులను పరిగణనలోకి తీసుకుంటూ అడవులను రక్షించడం అందరి బాధ్యతగా పిటిషనర్‌కు గుర్తు చేస్తూ, ట్రాక్టర్‌తో రెండెకరాల్లో అడవిని దున్నినందుకు ప్రతిగా అదే చోట ఒక్కో ఎకరంలో వంద చొప్పున రెండు వందల మొక్కలు నాటాలని తీర్పునిచ్చింది. తీర్పు కాపీ అందుకున్న నెల రోజుల్లో మొక్కలు నాటాలని స్పష్టం చేసింది. కొత్తగా నాటే మొక్కలను సూర్యాపేట అటవీ అధికారి పిటిషనర్‌కు సరఫరా చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. అంతేగాక రూ.50వేల పూచీకత్తు, ఇద్దరి ష్యూరిటీని నాలుగు వారాల్లో సమర్పించాలని సూచించింది. దీంతో ఎకరానికి రూ.2వేల కిరాయి కోసం ట్రాక్టర్‌ను అడవికి పంపిన యజమాని ఊహించని విధంగా తీర్పును అందుకోవాల్సి వచ్చింది. మరోవైపు కుశ్నపల్లి రేంజ్ అధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు హైకోర్టు తీర్పు పై హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో అడవిలో ఆక్రమణలను అరికట్టేందుకు ఇలాంటి తీర్పులు ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు.

డీఐఈవోగా అంజయ్య బాధ్యతలు స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈవో)గా అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రిన్సిపాల్ సంఘం, జిల్లా అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా తో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశా రు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, రాజ య్య, అంజయ్య, స్వరూప, శోభ, చందర్, విజేత, నగేష్, జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంజయ్యను సన్మానిస్తున్న సంఘాల సభ్యులు

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


అశోక్‌రెడ్డి (ఫైల్)

జైపూర్: జైపూర్ అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదనపు ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. భీమారం మండలం రెడ్డిపల్లి–ధర్మారానికి చెందిన మేడే అశోక్‌రెడ్డి(38), భార్య జ్యోతి దంపతులు. వీరికి కుమార్తె శాన్వి ఉంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కొంత అప్పులు చేశాడు. అవి తీర్చేమార్గం లేక అశోక్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. భార్య జ్యోతి ఇటీవల పుట్టింటికి వెళ్లింది. బంధువుల వివాహం ఉండగా భార్యని అక్కడే ఉండమని చెప్పి ఇంటికి వచ్చాడు. అశోక్‌రెడ్డి వారం క్రితం జైపూర్ సమీపంలోని అటవీప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై నాగరాజు తెలిపారు.

విరివిరిగా మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో విరివిగా మొక్కలు నాటాలని అటవీ సెక్షన్ అధికారి రవికుమార్, బీట్ అధికారి ముజీబొద్దీన్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం–పచ్ఛదనంలో భాగంగా ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో ప్లాస్టిక్ నివారణపై కలమడుగు వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలు, అడవిలో ప్లాస్టిక్ వేయడం జరిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం సతీశ్‌గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల దొంగల అరెస్టు


దొంగల అరెస్టు చూపిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో వాహనాలు దొంగిలించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రామకృష్ణపూర్‌కు చెందిన మంగలి సుమన్, కుంటాల సంతోష్, ఎలుకల పల్లి ఉమాదేవిలు గతనెల 18 న మంచిర్యాల ఎల్ఐసీ కాలనీలో ఆటోను దొంగిలించి రామకృష్ణాపూర్‌లో ఓ ఇంట్లో దాచి పెట్టారు. జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీకి చెందిన ఎండీ నయీంకు చెందిన ఆటోను చోరీకి యత్నించారు. వారి అలికిడి గమనించిన నయీం బయటకు రావడంతో పారిపోయారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు. ఐబీ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా సుమన్, సంతోష్, ఉమాదేవి అదుపులో తీసుకుని విచారించి అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

- జిల్లా కేంద్రంలోని 15 రోజుల క్రితం రెండు బైక్‌లు చోరీ చేసిన రామగుండం లంబడి తండాకు చెందిన మక్కల గంగాధర్‌ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆచారం.. మారేదెలా..!

- మహిళల నెలసరి సమయంలో కుప్పిలో విడిది
- గత రెండేళ్లలో పాముకాటుతో ఇద్దరు మృత్యువాత

సాక్షి, మంచిర్యాలడెస్క్: మహిళలు, యువతుల్లో రుతుక్రమం అనేది సహజమైన జీవ ప్రక్రియ. ప్రతీ మహిళ జీవన విధానంలో భాగమైన రుతుస్రావ ప్రక్రియపై పురాతన కాలం నుంచి అనేక ఆచారాలు, నమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. విద్యావంతులు, చైతన్యవంతం కావడంతో చాలా సామాజిక వర్గాల్లో నెలసరి సమయంలో పాటించే ఆచారాలు క్రమంగా దూరమయ్యాయి. కానీ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొలాం ఆదివాసీల్లో మాత్రం కుప్పిలో ఉండాలనే ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ ఆచారం పాటించే క్రమంలో సరైన విడిది లేక గత రెండేళ్లలో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం ధర్మడుగులో రెండేళ్ల క్రితం మహిళ, ఇదే మండలంలోని న్యూసోమార్‌పేట్‌లో యువతి సిడాం లక్ష్మి ఆదివారం పాముకాటుతో చనిపోయారు.


ఇటీవల న్యూసోమార్‌పేటలో పాముకాటుతో యువతి మృతిచెందిన కుప్పి

కుప్పి అంటే..

నెలసరి సమయంలో మహిళలు, యువతులు ఆచారం ప్రకారం ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిదినే కుప్పి అంటారు. నెలసరి పూర్తయ్యే వరకు వారు అందులోనే ఉండాల్సి ఉంటుంది. అవసరమైన ఆహార పదార్థాలు, నీరు కుటుంబ సభ్యులు అందిస్తారు. పూరిపాకలో ఉండాలంటే నరకమే కనిపిస్తుంది. ఆ సమయంలో ఒంటరిగా ఉండడం వల్ల మానసికంగా కుంగిపోయే అవకాశం లేకపోలేదు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆశ్రయమిస్తే..

గతంలో పాముకాటుతో మహిళ మృతిచెందిన సమయంలో ఈ ఆచారం విషయం అప్పటి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ దృష్టికి వెళ్లింది. మహిళలను చైతన్యవంతం చేసే ప్రయత్నం చేశారు. మరణాలనైనా అరికట్టాలని మహిళలకు నెలసరి సమయంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశ్రయం కల్పించాలని భావించారు. కానీ ఆ విషయంలో ముందడుగు పడలేదు. ఇప్పటికైనా మహిళలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతి కల్పిస్తే ప్రాణాలు కాపాడవచ్చు.

మనమూ మారాలి..

మహిళలు, సమాజాన్ని చైతన్యవంతం చేయడం కోసం నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో షార్ట్‌ఫిలిం నిర్మించారు. 'ఎస్ అన్‌స్టేకెబుల్ పెయిన్' పేరిట నిర్మించిన 5.23నిమిషాల నిడివి గల ఈ చిత్రాన్ని యూట్యూబ్‌లో 4,200మందికి పైగా వీక్షించారు. గ్రామంలో నెలసరి వచ్చిన వారిని గ్రామ శివారులోని పూరిపాకలో ఉంచుతారు. అలా పాటించని వారు ఒక కోడిని జరిమానా ఇవ్వాల్సి ఉంటుంది. ఓ తండ్రి తన పిల్లలను పూరిపాకలో ఉంచకుండా ఊరి పెద్ద వద్ద పంచాయితీలో జరిమానా చెల్లిస్తుంటాడు. స్త్రీలకు స్వేచ్ఛ, ఆత్మగౌరవం ముఖ్యమని, రోజులు మారాయి మనమూ మారాలి అంటూ ఆ తండ్రి పాత్ర సందేశాన్ని ఇస్తుంది. అనారోగ్యాన్ని తెచ్చే మద్యం బహిరంగ కొనుగోలు చేస్తున్నాం.. కానీ ఆరోగ్యాన్ని ఇచ్చే సానిటరి ప్యాడ్స్ కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నామని, ప్యాడ్స్ ఆనందంగా స్వీకరిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం అంటూ అధికారి పాత్ర చెప్పడంతో గ్రామస్తుల్లో చైతన్యం వస్తుంది. పూరిపాకను తొలగిస్తారు. అలాంటి చైతన్యం అందరిలోనూ రావాల్సిన అవసరం ఉంది.

చైతన్యవంతం కావాలి..



కొలాం సామాజిక వర్గంలో కూడా చైతన్యం రావాల్సి ఉంది. ఆచారం, సంప్రదాయాలను కూడా కాపాడుకోవాల్సి ఉంది. పాముకాటుతో యువతి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గ్రామస్తులు ఏకమై గ్రామంలోనే షెడ్డు వంటిది ఏర్పాటు చేసి వసతులు కల్పించాలి. ఫ్యాన్, బల్బ్ ఉండేలా చూస్తే బాగుంటుంది.

– కుమ్ర ఈశ్వరిబాయి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు


కంటెయినర్ హౌజ్

మోడల్ హౌజ్.. నిరుపయోగం..

ఏడాది క్రితం ఐటీడీఏ పీవోగా వరుణ్‌రెడ్డి పని చేసిన సమయంలో మహిళల ఇబ్బందులు దూరం చేయడానికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి చెరువుగూడలో మోడల్ హౌజ్(కంటెయినర్ హౌజ్) ఏర్పాటు చేయించారు. ఈ మోడల్ హౌజ్‌లో అటాచ్ బాత్రూం, ఫ్యాన్, బల్బ్, ప్యాడ్స్, అద్దం, వాటర్ ట్యాంకు ఉంటాయి. ఇందులోని సౌకర్యాలపై అప్పట్లో ఏపీవో పీవీటీజీ భాస్కర్ మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల నెలసరి సమయంలో పూరిపాకల్లో ఉండడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండడంతో దీన్ని ఐటీడీఏ నిధులతో ఏర్పాటు చేయించారు. కానీ ఎవరూ వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. వాటర్ లేకుండా పోయింది. అధికారులు మహిళలకు అవగాహన కల్పించి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న భాస్కర్(ఫైల్)

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో పోలీసులు

భీమిని: కన్నెపల్లి నుంచి ఆటో ట్రాలీలో మంచిర్యాలకు తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. కన్నెపల్లిలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో ట్రాలీని పరిశీలించగా బియ్యం లభించిందన్నారు. శ్రీనివాస్ ఆటోలో బియ్యాన్ని మంచిర్యాలలోని రాజుకి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏఈఈ ఉద్యోగం సాధించిన పేద విద్యార్థి


క్రాంతి కుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి అంబేద్కర్‌నగర్ బస్తీకి చెందిన నిరుపేద విద్యార్థి రోడ్లు భవనాల శాఖలో ఏఈఈ ఉద్యోగాన్ని సాధించారు. చిలుముల క్రాంతికుమార్ ..ఓయూలో ఇంజినీరింగ్ విద్య పూర్తిచేశాడు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పుస్తకాలతో కుస్తీ పట్టాడు. ఇటీవల వెలువడిన రోడ్లు, భవనాల శాఖలో రాష్ట్రస్థాయిలో 147 ర్యాంకు సాధించి ఏఈఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అదే తీరుగా మరో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు 1:1 గా పోటీలో నిలిచాడు. ఇతర ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్నా ఏఈఈ ఉద్యోగంలో చేరతానని క్రాంతికుమార్ తెలిపాడు. ఆయా ఉద్యోగాలకు ఇంకా ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. క్రాంతి తల్లి లక్ష్మి గృహిణి, తండ్రి రాయమల్లు దినసరి కూలి. పేదింటి బిడ్డ ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లి విరిసింది.

మామిడి చెట్లను నరికిన అధికారులు

- పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు


నరికిన మామిడి చెట్ల వద్ద రైతు కుటుంబం

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట శివారులో పోడు సాగు చేసుకుంటున్న దళిత రైతు జాడి మల్లేశ్‌కు చెందిన 150 మామిడి చెట్లను అటవీ అధికారులు మంగళవారం సాయంత్రం నరికి వేశారు. నరికిన మామిడి మొక్కలతో బుధవారం పోలీసుస్టేషన్‌కు వచ్చి బాధిత రైతు ఫిర్యాదు చేశారు. పక్కనే ఉన్న కొందరు రైతుల చెట్లను వదిలి మా మామిడి చెట్లనే నరికివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం నాటిన మామిడి మొక్కలను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నరికివేసిన అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై నార్వాయిపేట బీట్ ఆఫీసర్ వెంకటేశ్‌ను వివరణ కోరగా రైతు మల్లేశ్ రిజర్వు ఫారెస్ట్‌లో అక్రమంగా సాగు చేస్తున్నాడని ఇప్పటికే అతనిపై కోర్టులో కేసు నడుస్తుందన్నారు. ఎంత చెప్పినా పట్టించుకోలేదన్నారు. అటవీ హద్దులు గుర్తించి ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మొక్కలను తొలగించామన్నారు.

సామాజిక దీక్షకు తరలిన మాలలు


ఢిల్లీకి వెళ్తున్న మాల మహానాడు నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల 8,9,10 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే సామాజిక దీక్షకు బుధవారం మాల మహానాడు జిల్లా, రాష్ట్ర నాయకులు, శ్రేణులు తరలివెళ్లారు. జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపు మేరకు నాయకులు రైలులో ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. జాతీయకార్యదర్శి దమ్మ నారాయణ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి భూపల్లి మల్లన్న, జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేష్, కార్యదర్శి బడుగు తిరుపతి, జిల్లా నాయకులు తోకల రమేశ్, సురేందర్, దేవయ్య, సత్తయ్య, మల్లికార్జున్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అటెండెన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- జీఎం సంజీవరెడ్డి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల అంటెడెన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఏరియా ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎంత మంది పని చేస్తున్నారో వారి వివరాలు కంపెనీ సాప్ ప్రోగ్రాంలో ఉండాలన్నారు. వారికి ఇటీవల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో రూ.30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించామన్నారు. దీనికి పరిదిలో వచ్చేలా బ్యాంక్‌లో ఖాతాలను తెరుచుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అందరూ ఉద్యోగులు ఈ స్కీం పరిధిలో చేర్చాలన్నారు. దీంతోపాటు వారి సీఎంపీఎఫ్ అమలు చేయించాలన్నారు. ఏరియా ఇన్‌చార్జి ఎస్ఓటూజీఎం గోపాల్‌సింగ్, ఏజెంట్‌లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

- పోలీసుల అదుపులో నలుగురు
- 15 బైక్‌లు స్వాధీనం
- వెల్లడించిన డీసీపీ భాస్కర్


కానిస్టేబుల్‌కు అవార్డు అందజేస్తున్న డీసీపీ

జన్నారం: జల్సాలకు అలవాటు పడి, బైక్‌లు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో డీసీపీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. కలమడుగు గోదావరి వంతెన వద్ద బుధవారం పోలీసులు తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన మట్టపల్లి ప్రవీణ్ బైక్‌పై వచ్చాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా బైక్ పత్రాలు లేవు. అదుపులో తీసుకుని విచారించగా బైక్ చోరీచేసినట్లు ఒప్పుకున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన బొడ్డు అరుణ్‌ని జన్నారంలో విచారించగా బైక్ దొంగిలించినట్లు తేలింది. వారిద్దరిని లోతుగా విచారించడంతో హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్, జన్నారంలో బైక్‌లు చోరీ చేసి అమ్ముతున్నట్లు అంగీకరించారు. జన్నారం మండలం పొనకల్ గాంధీనగర్‌కు చెందిన కోట వినయ్, కామన్‌పల్లికి చెందిన వేముల ప్రవీణ్‌లు వీరితో సంప్రదింపులు జరిపి చోరీ చేసిన బైక్‌లు కొనుగోలు చేసి, జన్నారం, మంచిర్యాల పరిసరాల్లో అమ్మినట్లు తేలింది. వారి వద్ద ఉన్న 15 బైక్‌లను జన్నారం ఎస్సై రాజవర్ధన్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో 9, నిజామాబాద్‌లో 3, ఆర్మూర్‌లో 2, జన్నారంలో ఒక బైక్‌ను చోరీ చేశారు. మట్టపల్లి ప్రవీణ్, బొడ్డు అరుణ్, కోట వినయ్, వేముల ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకున్న లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్సై రాజవర్ధన్‌ను అభినందించారు. కానిస్టేబుళ్లు తుకారాం, గౌస్, భాస్కర్, సురేశ్, వెంకటేశ్‌లను అభినందించి రివార్డు అందజేశారు. ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ పాల్గొన్నారు.

కన్నాలబస్తీలో కరెంట్ సరఫరా నిలిపివేత

బెల్లంపల్లి: మున్సిపాలిటీ కన్నాల బస్తీలో బుధవారం కరెంట్ సరఫరాను సింగరేణి అధికారులు నిలిపివేశారు. బస్తీలో ఉన్న సింగరేణి కంపెనీ క్వార్టర్లు, ఖాళీ స్థలాలను ప్రభుత్వానికి యాజమాన్యం సరెండర్ చేయడంతో కార్మికులు, కార్మికేతరుల ఇళ్లకు కంపెనీ విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలుస్తోంది. సింగరేణి కరెంట్ లేక బస్తీలో అంధకారం నెలకొంది. ఎన్పీడీసీఎల్ కరెంట్ తీసుకున్న ఇళ్లల్లో వెలుగులు ఉండగా మెజార్టీ ఇళ్లలో కారుచీకట్లు కమ్ముకున్నాయి. ఏమాత్రం గడువు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం కరెంట్ నిలిపివేయడం సరికాదని 1వ వార్డు మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ తెలిపారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ


నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

చెన్నూర్: జనగామ పట్టణంలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని నిరసిస్తూ చెన్నూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్ గిల్డా మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై పోలీసుల దాడులు పెరిగిపోయాయని అన్నారు. ఏదైన సమస్య ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, దాడి చేసిన సీఐ, ఎస్సైలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాంభావు, ఎస్.రమేశ్, సంజీవ్, వికాస్, మద్ది కార్తీక్, పున్నం, మహేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దపేటలో 'విద్యాప్రవేశ్'


పరిశీలిస్తున్న శ్రీనివాస్

దండేపల్లి: విద్యాప్రవేశ్ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలను జాతీయ పరిశీలకులు శ్రీనివాస్, కల్పన బుధవారం సందర్శించారు. పాఠశాల ప్రార్థన సమయం నుంచి మొదలుకుని మధ్యాహ్నం వరకు పాఠశాలలోనే ఉండి ప్రతీ అంశాన్ని పరిశీలించి నమోదు చేశారు. ఒకటో తరగతి విద్యార్థుల పూర్వజ్ఞానం పరిశీలన, వారి ప్రతి స్పందనను పరిశీలించారు. టీచర్ల తరగతి బోధన, స్కూల్ హెడ్‌కు సంబంధించిన అంశాలతోపాటు మధ్యాహ్న భోజన పథకం వివరాలు, పాఠశాల పరిసరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయురాలు విశాలిని, సీఆర్పీ సురేందర్ పాల్గొన్నారు.

'రాజకీయాల కోసం మాలమాదిగల మధ్య చిచ్చు'


నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

జన్నారం: రాజకీయంగా లబ్ధి పొందడం కోసం మాలమాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం నిర్వహించారు. జాతీయ మాలమహానాడు నాయకుడు బెంజిమెన్ మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పుపై మాలమహానాడు జాతీయ కమిటీ నిరసన కార్యక్రమాలను పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీల్లో నిర్వహించే హలో మాల, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దేవేందర్, మండల అధ్యక్షుడు పాత బాలరాజు, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు దేవయ్య, ఇసాక్, జక్కుల సురేశ్, సంజీవ్, కరుణాకర్, ప్రభుదాస్, రాజన్న పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రుషి ఆదిత్య (ఫైల్)

తిర్యాణి: గుండాల జలపాతంలో ఈనెల 5న గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంగె రిషి ఆదిత్య(18) నలుగురు స్నేహితులతో కలిసి సోమవారం తిర్యాణి మండలంలోని గుండాల జలపాతం వీక్షించేందుకు వెళ్లారు. అక్కడ పెద్ద బండరాయి వద్ద నిల్చోని ఫొటో దిగుతుండగా రుషి ఆదిత్య అదుపుతప్పి పడిపోయాడు. తోటి స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో రెండు రోజులు గాలించగా బుధవారం మృతదేహం లభ్యమైంది. మృతుడు ఇటీవల పాలిటెక్నిక్ పూర్తి చేసి బీటెక్‌లో అడ్మిషన్ పొందేందుకు సన్నద్ధమవుతున్నాడు. ఈక్రమంలో జలపాతంలో పడి మృత్యువాత పడటం, తల్లిదండ్రులకు ఒక్కడే సంతానం కావడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి సంగె రవి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఘర్షణ


విద్యార్థులను విచారిస్తున్న ఆర్ఐ విజయలక్ష్మి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడ్డారు. వివరాల ఇలా ఉన్నాయి.. పాఠశాలలో ఉదయం టిఫిన్ తిన్న తర్వాత విద్యార్థులు డార్మేటరిలోకి వెళ్లి కూర్చున్నారు. అంతలో 8వ తరగతి విద్యార్థి కొట్రంగి గణపతి ఆరో తరగతి చదువుతున్న గుండ్ల అర్జున్‌ని ఏదో కారణంతో దుర్భాషలాడాడు. సదరు విద్యార్థులు పరస్పరం దూషించుకుని కొట్టుకున్నారు. పీఈటీ గోకుల్, హిందీ టీచర్ పండిత్ గమనించి ఆ ఇద్దరిని వారించారు. ఈ ఘటనలో అర్జున్ పంటికి దెబ్బ తగిలి గాయమైంది. ఇరువురిని ప్రభుత్వాసుపత్రికి పంపించారు. వైద్యులు చికిత్స అనంతరం కొన్ని గంటల తర్వాత డిశ్చార్జ్ చేశారు. వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు కొట్టుకున్నట్లు సహచర విద్యార్థులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్ జ్యోత్స్న తల్లిదండ్రులు, విద్యార్థులకు పాఠశాలలో కౌన్సెలింగ్ చేశారు. ఈ ఘటనపై ఆర్డీవో హరికృష్ణ, ఆర్ఐ విజయలక్ష్మిని విచారణకు పంపించారు. విచారణ అనంతరం నివేదిక ఇవ్వనున్నారు.

'సులభ్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బ్రహ్మానందం

శ్రీరాంపూర్: సింగరేణి సులభ్ కాంప్లెక్స్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. బుధవారం రెండో షిఫ్ట్‌లో శ్రీరాంపూర్‌లోని సులభ్‌కాంప్లెక్స్ వద్ద కార్మికులతో మాట్లాడారు. కార్మికులు చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. వైద్య సౌకర్యం కల్పించాలని, మృతిచెందితే రూ. 30 లక్షల ప్రమాద బీమాతోపాటు సీఎంపీఎఫ్, బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద ఈ నెల 10న చేపట్టే ధర్నాకు కార్మికులు తరలిరావాలని కోరారు. సులభ్ కార్మికులు మంతెన లక్ష్మయ్య, రాజేందర్, రాములు, కనుకయ్య, సమ్మయ్య, రాజు, వెంకటేశ్, శంకర్, జ్యోతి పాల్గొన్నారు.

ఎస్టీపీపీ జీఎంగా రాజశేఖర్‌రావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్‌రావు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు జీఎం(ఈఅండ్‌ఎం)గా ఎన్వీ.రాజశేఖర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో ఆయనను ఆయా డిపార్టుమెంట్ల అధికారులు, ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీలో పని చేసే ప్రతీ అధికారి, ఉద్యోగి ప్లాంటు అభివృద్ధికి తమవంతు సహకారం అందించి దేశంలోనే అత్యుత్తమ ప్లాంట్లలో ఒకటిగా నిలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం(పీసీఎస్) శ్రీనివాసులు, ఏజీఎం, డీజీఎంలు పాల్గొన్నారు.